సాక్షి వికారాబాద్

బుధవారం । 9 । ఆగస్టు । 2023



టీకాతో పశువులకు రక్షణ

పశువులకు సోకే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ప్రధానమైనది. టీకా ఇలాంటి వ్యాధుల నుంచి రక్షణ ఇస్తుంది. 8లో▸



గ్రామాల్లో గద్దర్ గుర్తులు

'ప్రశ్నించిన కలమతడు, గర్జించిన గళమతడు, సామాన్యుల ముమ్మందుకునడిపించిన బలమతడు !' 8లో▸



ఎలా సాధ్యం?

పేదల సొంతింటి కల.. కలగానే మిగలనుందా అంటే. అవుననే సమాధానం వస్తోంది. 9లో▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



వంటావార్పుతో నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్ఎంలు

అనంతగిరి: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ రెండో ఏఎన్ఎంలు కలెక్టరేట్ ఎదుట మంగళవారం వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నోటిఫికేషన్ల పేరిట కాలయాపన చేయకుండా ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, ఏఎన్ఎంల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ మహరాజ్



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రమేష్ మహరాజ్ తదితరులు

తాండూరు రూరల్: కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటామని పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ మహరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఓగిపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు బస్వరాజ్ పటేల్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రమేష్ మహరాజ్ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బస్వరాజ్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని పేర్కొన్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప, యూత్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రాథమిక విద్యే పునాది

జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ రాంకిషోర్



సమావేశంలో మాట్లాడుతున్న రాంకిషోర్

మర్పల్లి: ప్రాథమిక విద్యే విద్యార్థులకు పునాదని జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ రాంకిషోర్ అన్నారు. మర్పల్లి ఎమ్మార్సీలో 6 రోజులుగా ఉపాధ్యాయులకు నిర్వహించిన తొలిమెట్టు శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి రాంకిషోర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా భావించాలన్నారు. అప్పుడే విద్యార్థులకు చక్కటి బోధన చేయగలరని పేర్కొన్నారు. శిక్షణ శిబిరంలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని విద్యార్థులకు బోధించాలన్నారు. అనంతరం ఎంఈఓ విద్యాసాగర్ మాట్లాడుతూ తొలిమెట్టు అమల్లో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలన్నారు. ప్రతి విద్యార్థి ఆంగ్లంలో చదవడం, రాయడం ఉపాధ్యాయుల బాధ్యత అన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ బాలయ్య, రమేష్, సీఆర్‌పీలు మల్లేశం, యాదయ్య, మహబూబ్ అలీ, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి



డీటీ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీర్ మహ్మద్

పరిగి: గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్న రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ పరిగి డివిజన్ కార్యదర్శి పీర్ మహ్మద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రంగాపూర్ సర్వే నంబర్ 18లో 9ఎకరాల 39 గుంటల ప్రభుత్వ భూమి ఉందని, దాన్ని కొంత మంది రియల్టర్లు ఆక్రమించుకున్నారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్రయ్య, కృష్ణయ్య, అంజిలయ్య, దశరథ్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్‌కు ప్రోత్సాహం



- జిల్లాలో దశల వారీగా 31వేల ఎకరాలు లక్ష్యం
- ఈ ఏడు 3వేల ఎకరాల్లో..
- నాలుగేళ్లలో పంట చేతికి
- 90శాతం సబ్సిడీతో మొక్కలు, డ్రిప్ పరికరాలు
- ఆసక్తి చూపుతున్న రైతులు

వికారాబాద్ అర్బన్: జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పంట సాగు జిల్లా రైతాంగానికి కొత్తది కావడంతో అవగాహన కల్పించడంతో పాటు, సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో కొత్తగా ఐదు జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగుకు అనుమతి ఇవ్వగా అందులో వికారాబాద్ జిల్లాకు చోటు లభించింది. జిల్లాలో దశల వారీగా 31వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును అందుబాటులోకి తెచ్చేందుకు ఉద్యానవన శాఖ ప్రయత్నాలు సాగిస్తోంది. నాలుగేళ్లలో ఈ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉంది. కాగా ఎంఎస్ హెల్దీ హార్ట్స్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ తోటల పెంపకాన్ని చేపట్టనున్నారు.

ఈ ఏడాది 3వేల ఎకరాలు లక్ష్యం

జిల్లాలో 31వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం కాగా 2023 – 24 సంవత్సరానికి గాను 3వేల ఎకరాల్లో పంట సాగు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జూలై రెండో వారం నుంచే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఉద్యానవన శాఖ అధికారులు.. వ్యవసాయ శాఖ అధికారుల సహకారంతో తోటల పెంపకానికి అనువైన భూములను గుర్తించారు. నెల రోజుల నుంచి తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాలోని పలువురు రైతులకు సాగుపై అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే 1,542 ఎకరాల్లో తోటలు పెంచేందుకు రైతులు ముందుకొచ్చారు. మొక్కల కొనుగోలుకు డీడీలను సైతం కట్టారు.

90శాతం వరకు సబ్సిడీ

మార్కెట్‌లో స్వీట్ ఆయిల్‌కు మంచి డిమాండ్ ఉంది. దీంతో ప్రభుత్వం ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు 80 నుంచి 90శాతం సబ్సిడీ అందిస్తూ ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తోంది. ఒక్కో ఆయిల్ పామ్ మొక్క ధర రూ. 193 కాగా ప్రభుత్వం రాయితీ కింద రూ. 173 చెల్లిస్తోంది. దీంతో రైతు కేవలం రూ. 20 చెల్లిస్తే సరిపోతుంది. ఈ పంట సాగుకు నీటి వసతి పుష్కలంగా ఉండాలి. చిన్న, సన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీతో డ్రిప్, ఇతర సామగ్రి సరఫరా చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీ ఇస్తోంది. ఆయిల్ పామ్ సాగులో అంతర పంటలు వేసుకునేందుకు కూడా ప్రభుత్వం సహకారం అందిస్తోంది. ఎకరా ఆయిల్ పామ్ సాగుకు రూ. 2100 ఇస్తుండగా, అంతర పంటల సాగుకు రూ. 2100 చెల్లిస్తోంది. ఈ లెక్కన ఏడాదికి ఒక ఎకరానికి రూ. 4200 చొప్పున నాలుగేళ్ల పాటు ప్రోత్సాహకాన్ని అందించనుంది. ఒక ఎకరంలో 55 నుంచి 57 వరకు మొక్కలు నాటుకునే అవకాశం ఉంటుంది. నాలుగేళ్లకు పంట చేతికొస్తుంది. ఈ సమయంలో రైతుకు ఉద్యానవన శాఖ ద్వారా ఎకరాకు రూ. 50,918 సబ్సిడీ అందుతుంది. ఇలా దశల వారీగా సబ్సిడీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి.

కంపెనీలే కొనుగోలు చేస్తాయి

ఆయిల్ పామ్ దిగుబడికి మార్కెట్ ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వం నిర్దేశించిన కంపెనీలు రైతుల నుంచి పంటను సేకరించి మార్కెట్ ధర చెల్లిస్తాయి. సమీపంలోని తోటల నుంచి కంపెనీలే పంట దిగుబడిని ట్రాన్స్‌పోర్టు చేసుకుంటాయి. దీంతో రైతులకు రవాణా భారం తగ్గుతుంది.

టార్గెట్ పూర్తి చేస్తాం



జిల్లాలో ఆయిల్ పామ్ సాగు కొత్తదే. అయినా రైతుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఇప్పటి వరకు 1,500 మంది రైతులు మొక్కల కోసం డీడీలు చెల్లించారు. మరో 1,500 మొక్కలు కొనుగోలు చేసేలా ప్రోత్సహిస్తాం. పంట సాగుకు వేసవిలో కూడా నీరు పుష్కలంగా ఉండాలి. నీటి సౌకర్యం ఉన్న రైతులే ఈ పంట సాగు చేయాలి.

– చక్రపాణి, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి

కౌన్సెలింగ్‌కు మరో అవకాశం

వికారాబాద్ అర్బన్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా లో డీఈఈ సెట్ –2023లో ఉత్తీర్ణత సాధించి హాజరు కాని అభ్యర్థుల కోసం మరో అవకాశం కల్పిస్తున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కే రామాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 10, 11 తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. మొదటి సంవత్సరం తెలుగు, ఉర్దు, ఇంగ్లిష్ మీడియంలో 2023 – 25 ప్రవేశాల నిమిత్తం ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు తెలిపారు. ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, ఎస్ఎస్‌సీ, ఇంటర్ మెమోలు, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్స్‌తో వికారాబాద్ డైట్ కళాశాలకు రావాలని సూచించారు.

సాఫీగా మున్సిపల్ సమావేశం



అభివృద్ధి పనులకు ఆమోదం తెలుపుతున్న కౌన్సిల్ సభ్యులు

- 38అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

వికారాబాద్ అర్బన్: ఏడాదిన్నర తరువాత వికారాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సాఫీగా సాగింది. చైర్‌పర్సన్ పదవి పంపకం విషయం తలెత్తిన గొడవతో అధికార పార్టీ కౌన్సిలర్లే ఇన్నాళ్లు చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా సమావేశం జరగకుండా అడ్డుతగిలారు. ఎలాంటి చర్చ లేకుండానే ఆరు కౌన్సిల్ సమావేశాలు వాయిదా పడ్డాయి. ఇంతలో ఏం జరిగిందో ఏమో కానీ మంగళవారం చైర్‌పర్సన్ మంజుల అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశం ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా సాగింది. పైగా 38 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించడం గమనార్హం. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మున్సిపల్ అభివృద్ధికి సహకరిస్తూ,సమస్యల పరిష్కారానికి ఆరోగ్యకరమైన చర్చకు సహకరించిన కౌన్సిల్ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ సమావేశంలో చైర్‌పర్సన్ 38 అంశాలను ప్రవేశపెట్టారు. వీటితో పాటు 5 అంశాలను టేబుల్ ఎజెండాలో ప్రవేశ పెట్టారు. వీటన్నింటిని కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎజెండాలో ప్రధానంగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. కోటి 48 లక్షలను వివిధ వార్డుల అభివృద్ధికి కేటాయించారు. శివారెడ్డి పేట్ చెరువు మరమ్మతులకు రూ. 20లక్షలు, పలు వార్డుల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు రూ. 17 లక్షలు, జర్నలిస్టు కాలనీలో విద్యుత్ లైన్ ఏర్పాటుకు రూ. 7.65లక్షలు కేటాయించారు. సమావేశంలో వైస్ చైర్మన్ శంషాద్ బేగం, కమిషనర్ జాకీర్ అహ్మద్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేడుకలు ఘనంగా జరపాలి



స్థల పరిశీలన చేసి ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అడిషనల్ కలెక్టర్

- కలెక్టర్ నారాయణరెడ్డి
- స్వాతంత్య్ర వేడుకలకు స్థల పరిశీలన

వికారాబాద్ అర్బన్: కలెక్టరేట్‌లో ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం ఎస్పీ కోటిరెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, డీఎస్పీ నర్సింలుతో కలిసి వేడుకలు నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. జాతీయ జెండా ఆవిష్కరణ, స్టాళ్ల ఏర్పాటు, వీఐపీ, అధికారుల కోసం గ్యాలరీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు కూర్చొని వేడుకలు తిలకించేలా ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు.

ఉద్యోగి కిడ్నాప్ కథ సుఖాంతం

- చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు
- వికారాబాద్‌లో ఘటన
- పోలీసులను చూసి పారిపోయిన నిందితులు
- బాలరాజు సేఫ్, కారు స్వాధీనం
- నిందితుల కోసం గాలింపు
- వ్యాపార లావాదేవీలే కారణం



కిడ్నాపర్లు వదలి వెళ్లిన కారు



బాలరాజు భార్య శ్రీలత నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ శీను



పోలీస్‌స్టేషన్ వద్ద బాలరాజు

అనంతగిరి: వ్యాపార లావాదేవీల కారణంగా ప్రభుత్వ ఉద్యోగి(అటెండర్)ని కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేసి తాళ్లతో కట్టేసి దాడి చేశారు. పోలీసుల రాకను గుర్తించి నిందితులు పారిపోయారు. ఈ ఘటన మంగళవారం వికారాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ శీను కథనం మేరకు.. మండలంలోని అత్వెల్లి గ్రామానికి చెందిన కావలి బాలరాజు అనంతగిరి టీబీ శానిటోరియంలో అటెండరుగా పని చేస్తున్నాడు. వికారాబాద్ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. ఉదయం 9గంటలకు బాలరాజు తన పిల్లలను ద్విచక్ర వాహనంపై పట్టణంలోని బీటీఎస్ కాలనీలో గల నారాయణ స్కూల్‌లో దింపాడు. ఆ సమీపంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు టీఎస్ 07 ఎఫ్‌జడ్ 8400 నంబర్ గల ఎర్ర కారులో వచ్చి బాలరాజు బలవంతంగా ఎక్కించుకెళ్లారు. కిడ్నాప్ విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలిపారు. తక్షణం స్పందించిన వికారాబాద్ డీఎస్పీ నరసింహులు ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి బాల్‌రాజ్ సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అత్వెల్లి గ్రామం వైపు వెళ్లినట్లు గుర్తించారు. ఆ మార్గంలో వెళ్లగా గ్రామ సమీపంలోని ఓ గుంతలో బాలరాజు కనిపించాడు. అతన్ని తాళ్లతో కట్టేసి దాడి చేసినట్లు గుర్తించారు. తమ రాకను చూసి కిడ్నాపర్లు పారిపోయి ఉంటారని పోలీసులు తెలిపారు. నిందితుల కోసం గాలిస్తున్నామని, త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు. వ్యాపార లావాదేవీల కారణంగానే కిడ్నాప్ జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. బాలరాజు భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శీను తెలిపారు.

'కలక'లం



- వేగంగా విస్తరిస్తున్న వైరస్
- జిల్లాలో పెరుగుతున్న ఐఫ్లూ కేసులు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

షాబాద్: కళ్లకలక (ఐఫ్లూ) జిల్లావాసులను కలవరపెడుతోంది. రోజుకు సగటున 1,521 మందికి ఐఫ్లూ సోకుతున్నట్లు వైద్యులు అంచనా వేస్తున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో 2వేల మందికి ఐఫ్లూ సోకడం ఆందోళన కలిగిస్తోంది. రోజురోజుకూ ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితుల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో వివిధ ఆస్పత్రులకు నిత్యం 60 నుంచి 70 మంది వరకు వస్తున్నారు. వర్షాకాలం కళ్లకలక రావడం సాధారణమే అయినప్పటికీ వాతావరణంలో మార్పుల కారణంగా ఈసారి వేగంగా వ్యాప్తి చెందుతోందని వైద్యులు చెబుతున్నారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే అరికట్టవచ్చని సూచిస్తున్నారు.

ఐఫ్లూ లక్షణాలు..

- బ్యాక్టీరియా, వైరల్, అలర్జిక్ ద్వారా కళ్లకలక వ్యాప్తి చెందుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.
- అలర్జిక్ ద్వారా వ్యాధి స్వల్పంగా వ్యాప్తి చెందే అవకాశం ఉండగా బ్యాక్టీరియాతో 20 శాతం, వైరల్ ద్వారా 80 శాతం వ్యాపిస్తుంది.
- సాధారణంగా ఆడినో వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుంది. కళ్లకలక వచ్చిన వారికి కళ్లలో నీరు కారడం, ఎరుపెక్కడం, దురద వంటి లక్షణాలుంటాయి.
- కొన్నిసార్లు కళ్లు ఉబ్బడం, రెప్పలు అతుక్కొని చూడలేని పరిస్థితి ఎదురవుతుంది.
- కొన్నిసార్లు తీవ్రమైన జలుబుకులోనై కళ్లకు దురద రావడంతో తరచూ చేతులతో రుద్దుతుంటారు. దీంతో సమస్య మరింత పెరుగుతుంది.
- ఐఫ్లూ ఎక్కువగా వర్షాకాలంలో వ్యాపిస్తుంది. గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. దీంతో వైరస్ వ్యాపించే అవకాశం, మనగలిగే అవకాశం అధికంగా ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- బాధితులు కనీసం వారం రోజుల పాటు ప్రత్యేకంగా ఒక గదిలో ఉండాలి.
- శుభ్రమైన గుడ్డతో గోరువెచ్చని నీటితో తుడుచుకోవాలి.
- కళ్లకలక సోకిన వారు తరచూ కళ్లను తాకాల్సి వస్తుంది. అలా తాకిన ప్రతీసారి చేతులు శుభ్రం చేసుకోవాలి.

ఆందోళన వద్దు



కళ్లకలక వచ్చిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వైద్యుల సలహా మేరకు చికిత్స పొందాలి.వారం రోజుల్లో తగ్గుతుంది. కొంతమందికి పక్షం రోజులు పట్టే అవకాశం ఉంటుంది. బాధితులు భౌతిక దూరం పాటిస్తే ఇతరులకు వ్యాప్తి చెందకుండా ఉంటుంది.

– డాక్టర్ శ్రీనివాస్, షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఇంజనీ'రింగ్'

- కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన ఇంజనీరింగ్ విభాగం అధికారులు
- అభివృద్ధి పనుల్లో ఎవరి వాటా వారిదే
- పర్సెంటేజీల లెక్కన పంపకాలు
- తేలిపోతున్న నాణ్యత



పరిగిలో ఏడాది క్రితం వేసిన రోడ్డుకు రెండు సార్లు మరమ్మతులు చేసినా.. ఇదీ ప్రస్తుత పరిస్థితి

వికారాబాద్: ఇంజనీరింగ్ వ్యవస్థ గాడి తప్పుతోంది. పనులు ఏవైనా పర్సెంటేజీలే పరమావధిగా ముందుకు సాగుతున్నారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు చేపట్టే పనుల్లో నాణ్యత ఉండడం లేదు. కింది స్థాయి ఉద్యోగులను మొదలుకొని జిల్లాస్థాయి అధికారుల వరకు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పనుల్లో నాణ్యత లోపించినా బిల్లులు చేసి కాంట్రాక్టర్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో చేసిన పనులు మూణ్నాళ్ల ముచ్చటగా మారి నెలల వ్యవధిలోనే పగుళ్లు వచ్చి పాడైపోతున్నాయి.

అంచనాల్లో ఇసుక.. పనుల్లో డస్టు

అభివృద్ధి పనుల్లో సిమెంటు తోపాటు ఇసుక వినియోగిస్తామని అధికారులు చెబుతున్నా కాంట్రాక్టర్లు మాత్రం ఇసుక స్థానంలో డస్ట్ వాడుతున్నారు. ప్రతి పనిలో 20శాతం ఇసుక 80శాతం డస్ట్ వినియోగిస్తున్నారు. మరి కొన్ని చోట్ల వంద శాతం డస్టే వాడుతున్నారు. లారీ డస్ట్ రూ. 10 వేల నుంచి రూ. 12లోపు లభిస్తుంది. అదే ఇసుక అయితే రూ. 40 వేల నుంచి రూ. 50వేలకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ వ్యత్యాసం వల్లే సదరు కాంట్రాక్టర్లు ఇసుక స్థానంలో డస్ట్ వాడుతున్నారు. దీంతో కొన్నేళ్ల పాటు పటిష్టంగా ఉండాల్సిన నిర్మాణాలు నెలల్లోనే పాడవుతున్నాయి. కాంట్రాక్టర్ దక్కించుకున్న టెండర్ మొత్తాన్ని బట్టి అధికారులు 25నుంచి 30 శాతం పర్సెంటేజీలు తీసుకుంటున్నట్లు సమాచారం. సర్పంచులు, ఎంపీటీసీలు పనులు చేసినా అధికారుల వాటా తప్పని సరి. ఏఈకి 5శాతం, డీఈకి 3శాతం, ఈఈకి 2 శాతం, సెక్షన్‌లో రెండు శాతం, క్వాలిటీ కంట్రోల్ విభాగానికి ఒక్క శాతం ఇలా 10 నుంచి 13శాతం వరకు అధికారులకు ఇస్తున్నట్లు తెలిసింది.

రూ.కోట్ల విలువ చేసే పనులు

ఉపాధి హామీ పథకంలో భాగంగా 2022– 23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు మెటీరియల్ కాంపోనెంట్ కింద ప్రభుత్వం 717 పనులు మంజూరు చేసింది. ఇందులో 715 సీసీ రోడ్లు, సైడ్ డ్రేయిన్, మెటల్ రోడ్డు ఉన్నాయి. ఈ పనులకు గాను రూ.60.96 కోట్లు మంజూరు చేసింది. వీటిలో అధిక శాతం సీసీ రోడ్లే. వీటితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అనేక పను లు చేపట్టారు. అలాగే జీపీ, మండల పరిషత్, జెడ్పీ తదితర నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, వంతెన నిర్మాణాలు చేపట్టారు. మెజార్టీ పనులు డస్ట్‌తోనే చేపట్టారు.

కొరవడిన నాణ్యత

పరిగి మున్సిపల్ పరిధిలోని కోర్టు చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వేసిన బీటీ రోడ్డు ఆరు నెలలు తిరక్కుండానే పాడయ్యింది. ఇప్పటికి రెండు సార్లు మరమ్మతులు చేశారు. అయినా ఫలితం లేదు. దౌల్తాబాద్ మండలం ఈర్లపల్లి, సూరాయపల్లి, గుండాల గ్రామాల్లో వేసిన సీసీ రోడ్ల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇదే మండలంలోని ర్యాలగుట్ట తండాకు వేసిన బీటీ రోడ్డు ఏడాది తిరగకుండానే గుంతలమయంగా మారింది. దోమ మండలం పెద్దతండ, బొంపల్లి తండాకు వేసిన బీటీ రోడ్డు ఏడాది గడవక ముందే గుంతలమయంగా మారాయి. నవాబుపేట మండలం చిట్టిగిద్ద గ్రామంలోనూ సీసీ రోడ్డు పాడయ్యింది.

మా దృష్టికి రాలేదు



అభివృద్ధి పనుల్లో పర్సెంటేజీల విషయం మా దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే పరిశీలించి నిజమైతే చర్యలు తీసుకుంటాం. అలాగే నాణ్యత విషయంలో కూడా రాజీ పడం. నిబంధల మేరకు పనులు జరిగేలా చూస్తాం. అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యత లేకుంటే మళ్లీ చేయిస్తాం. అవసరమైతే చర్యలు కూడా తీసుకుంటాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ పంచాయతీరాజ్

క్లుప్తంగా

'గృహలక్ష్మి'దరఖాస్తు గడువు పెంచాలి

వికారాబాద్ అర్బన్: గృహ లక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు పెంచాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింలు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకునేందుకు తక్కువ సమయం ఇవ్వడంతో చాలా మంది అర్హులు దరఖాస్తు చేసుకోలేదన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో ఆదాయం, కులం ధ్రువీకరణ సర్టిఫికెట్లు పొందడానికే నాలుగు రోజుల సమయం పట్టిందన్నారు. మీ సేవా కేంద్రాల్లోనూ గృహ లక్ష్మితో పాటు, ఇతర ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో దరఖాస్తుకు సాధ్యమవ్వడం లేదన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గడువును పెంచాలన్నారు.

జన్మదిన వేడుకల్లో అపశ్రుతి

- ట్రాక్టర్ కిందపడిన బాలుడు
- పరిస్థితి విషమం

తాండూరు టౌన్: టీఆర్ఎస్ నాయకుడు అబ్రార్ లాలా జన్మదిన వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి తెలిపిన ప్రకారం.. అబ్రార్ లాలా బర్త్‌డే వేడుకల సందర్భంగా హైదరాబాద్ నుంచి పంజాగుట్ట ఫయాజ్‌ను ఆహ్వానించారు. ఆయనకు స్వాగతం పలికేందుకు సౌండ్ బాక్సులు ఏర్పాటు చేసి మంగళవారం రాత్రి స్థానిక విలియం మూన్ చౌరస్తా నుంచి ఇందిరాచౌక్ వైపునకు ర్యాలీ తీస్తున్నారు. ఈ సమయంలో పట్టణంలోని రెహమత్‌నగర్‌కు చెందిన 14ఏళ్ల బాలుడు రేహాన్ చౌరస్తా వైపు సైకిల్‌పై వెళ్తుండగా ఓ బైకు ఢీకొన్నది. దీంతో వేడుకల్లో సౌండ్ బాక్సులకు ఉపయోగిస్తున్న ట్రాక్టర్‌కు అటాచ్‌గా ఉన్న జనరేటర్ ట్రాలీ కింద బాలుడు పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

రైల్వే లైన్ సర్వేకు రూ.7.40 కోట్లు మంజూరు

ఆమనగల్లు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాలను కలుపుతూ డోర్నకల్ మీదుగా సూర్యాపేట వరకు నూతన రైల్వే లైన్ ఏర్పాటు సర్వే కోసం కేంద్ర ప్రభుత్వం రూ.7.40 కోట్లు మంజూరు చేసిందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి చెప్పారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూర్యాపేట, నల్గొండ మీదుగా కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల మీదుగా డోర్నకల్ వరకు నూతన రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని గతంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని గుర్తు చేశారు. ఈ మేరకు దాదాపు 296 కిలోమీటర్ల రైల్వే లైన్ సర్వే కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. రైల్వే లైన్ సర్వేకు సహకరించిన పీఎం మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి డీకే అరుణ తదితరులకు ఆచారి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నర్సింహ, లక్ష్మణ్, చెన్న కేశవులు, శ్రీకాంత్‌సింగ్ తదితరులున్నారు.

అతివేగంతో ప్రమాదం

ఇబ్రహీంపట్నం రూరల్: బొలేరో అతివేగంగా బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. యాచారం మండల కేంద్రానికి చెందిన బి.నాగరాజు, జి.శ్రీనివాస్ ఆర్టీఏ కార్యాలయంలో ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. మన్నెగూడ ఆర్టీఏ కార్యాలయం నుంచి బొంగ్లూరు వద్ద టీ తాగేందుకు వారు బైక్‌పై వెళ్తున్నారు. అతివేగంగా ప్రయాణిస్తున్న బొలేరో వారి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వారు ఎగిరి పడ్డారు. దీంతో శ్రీనివాస్ కాలు విరగ్గా, నాగరాజుకు గాయాలయ్యాయి. రోడ్డుపై పడిన బొలేరో వెనుక నుంచి వస్తున్న మరో కారు ఢీకొట్టడంతో వారి కారు ధ్వంసమైంది. క్షతగాత్రులను స్థానికులు మహోనియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

టీకాతో పశువులకు రక్షణ



పర్సాపూర్‌లో గాలికుంటు నివారణ టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

- గాలికుంటు నివారణకు చర్యలు
- ఈనెల 28వరకు గ్రామాల్లో వైద్య శిబిరాలు

కొడంగల్ రూరల్: పశువులకు సోకే తీవ్రమైన అంటువ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ప్రధానమైంది. దీన్నే «గాళ్లు» అని పిలుస్తారు. ఇది వైరస్ ఆశించడంతో వస్తుంది. పశువులకు ఆశించే వైరస్‌లన్నింటిలోకి గాలికుంటు వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వ్యాధిని నిరోధించేందుకు, పశువులకు సోకకుండా ముందస్తుగా ఇస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని కోరుతున్నారు. పశువైద్య సిబ్బంది గ్రామాలకు చేరుకొని గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

వ్యాధి లక్షణాలు

వ్యాధి సోకగానే పశువుల శరీరంలో ఉష్ణోగ్రత పెరుగుతుంది. పశువులు మేత మేయవు. నీరసంగా ఉంటాయి. దవడలోపల, పంటి చిగుళ్ల మీద, బొబ్బలు ఏర్పడతాయి. కాలి గిట్టల మధ్యలో బొబ్బలు చితికి పశువులు నొప్పితో కుంటుతూ నడుస్తుంటాయి. ఈగలు వాలడంతో పురుగులు పడేందుకు అవకాశం ఉంటుంది. ఇలాంటి కారణాలతో పశువులకు పుండ్లు మానడం ఆలస్యమవుతుంది. వ్యాధి సోకిన పాడి పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని వైద్యాధికారులు చెబుతున్నారు.

వ్యాధి వ్యాప్తి

ఒక పశువు నుంచి మరొక పశువుకు గాలి ద్వారా వ్యాపిస్తుంది. లేదంటే కలుషితమైన వస్తువుల ద్వారా వ్యాపిస్తుంది. వ్యాధి పీడిత పశువుల మూత్రం, పేడ, చొంగ కారడం వల్ల ఈ వైరస్ బయటకు వస్తుంది. వాటివల్ల పశువు పరిసరాలలో ఉండే నీరు, గడ్డి, ఎరువు మొదలయినవాటితో వైరస్ ప్రబలుతూ ఇతర పశువులకు సోకే అవకాశం ఉంది.

టీకా వేయించాలి



పశు వైద్య సిబ్బంది గ్రామాల్లో శిబిరాలను నిర్వహించే క్రమంలో రైతులు తమ పశువులకు గాలి కుంటు నివారణ టీకాలను వేయించాలి. వ్యాధి సోకకముందే జాగ్రత్తలు తీసుకోవడంతో పశువులు ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుంది.

– రియాజ్ అహ్మద్, పశు వైద్యాధికారి, హస్నాబాద్

చర్యలు

వైరస్ పశువు మీద చేపట్టే చర్యలను బట్టి పశు వైద్యులు చికిత్స అందిస్తారు. ముందుగా పుండ్లు మానేందుకు ఈగలు వాలకుండా ఉండేందుకు చికిత్స చేయించాలి. కాలి పుండ్లకు వేపనూనెలో జింక్ ఆక్సైడ్ పొడి కలిపి రాయాలి. పశువైద్యులు యాంటి బయాటిక్ ఇంజక్షన్లు ఇస్తుంటారు. లేగ దూడలకు తల్లిపాలను తాగించకూడదని వైద్యులు తెలుపుతున్నారు.

జాగ్రత్తలు

పశువుల పాకలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. వ్యాధి నిరోధక టీకాలను వ్యాధి సోకకముందే ఇప్పించాలి. వ్యాధి ప్రబలినట్లు తెలిస్తే.. ఇతర పశువులు అటువైపు వెళ్లకుండా చూడాలి పశువులన్నింటికీ వ్యాధి నిరోధక టీకాలను వేయించాలి. వ్యాధి వ్యాప్తిని అదుపు చేసేందుకు ప్రయత్నం చేయాలి. వ్యాధి సోకిన పశువులకు సరైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో పశు వైద్య శిబిరాలతో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయనున్నట్లు పశువైద్యులు తెలిపారు.

గ్రామాల వారీగా పశువైద్య శిబిరం వివరాలు

తేదీ	గ్రామం
ఆగస్టు 9న	ఉడిమేశ్వరం, పెద్ద నందిగామ, నాగారం
10న	ఉడిమేశ్వరం, తుపాకుల తండా, అన్నారం
11న	పాతకొడంగల్, అచ్చిరెడ్డితాండా, అన్నారం
12న	పాతకొడంగల్, హుస్సేన్‌పూర్, టేకుల్‌కోడ్
14న	పాతకొడంగల్ తండా, హుస్సేన్‌పూర్, టేకుల్‌కోడ్
15న	అయినన్‌పల్లి, ప్యాలమద్ది, టేకుల్‌కోడ్ తండా
16న	అయినన్‌పల్లి, ప్యాలమద్ది, దుంకుడుతండా.
17న	కొడంగల్, బూర్షుఖాన్‌పల్లి, అంగడిరాయిచూర్
18న	కొడంగల్, చిన్ననందిగామ, అంగడిరాయిచూర్
19న	కొడంగల్, చిన్ననందిగామ, ధర్మాపూర్
21న	కొడంగల్, హస్నాబాద్, సంఘాయిపల్లి
22న	చిట్లపల్లి, హస్నాబాద్, లక్ష్మీపల్లి
23న	చిట్లపల్లి, హస్నాబాద్, ఇందనూర్
24న	ఖాజాఅహ్మద్‌పల్లి, హస్నాబాద్, కస్తూర్‌పల్లి
25న	పోశమ్మతండా, ఉప్పర్‌పల్లి
26న	మైశమ్మతండా, రావులపల్లి
28న	రావులపల్లి

ఎస్‌ఐలుగా ఆరుగురు కానిస్టేబుల్స్



అనంతగిరి: ఎస్‌ఐలుగా ఎంపికైన కానిస్టేబుల్స్‌ను సన్మానిస్తున్న ఎస్పీ తదితరులు

అభినందించిన ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: టీఎస్‌పీఎల్‌ఆర్‌బీ విడుదల చేసిన ఎస్‌ఐ తుది ఫలితాల్లో జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు కానిస్టేబుల్స్ సత్తాచాటారు. ఈ సందర్భంగా మంగళవారం వారిని ఎస్పీ కోటిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కానిస్టేబుల్స్‌గా విధులు నిర్వహిస్తూనే ఎస్‌ఐలుగా ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రజా సేవ చేసేందుకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ విధులు, కర్తవ్యాల్లో జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఎస్‌ఐలుగా ఎంపికైన కానిస్టేబుల్స్ ఉమాదేవి, రాజేందర్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి , శ్రీశైలం, శశిధర్, సుజిత్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీనివాసరావు, డీసీఆర్బీ డీఎస్పీ జానయ్య, ఏఓ జ్యోతిర్మని, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల, ఆర్‌ఐ సూర్య నాయుడు, జిల్లా పోలీస్ ప్రెసిడెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



బంట్వారం: ఎస్పీ కోటిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌ఐ స్రవంతి

ఎస్పీని కలిసిన కోట్‌పల్లి ఎస్‌ఐ

బంట్వారం: ఇటీవల కోట్‌పల్లి ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన స్రవంతి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కోటిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ ఆమెకు పలు సూచనలు చేశారు. లా అండ్ ఆర్డర్, క్రైం, సివిల్ తగాదాలు తదితర అంశాలపై వివరించారు.

ఈవీఎంలపై అవగాహన తప్పనిసరి

ఆర్‌ఐ రాజిరెడ్డి

పెద్దేముల్: ఈవీఎంలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని ఆర్‌ఐ రాజిరెడ్డి అన్నారు .మంగళవారం మండల పరిధిలోని రుక్మాపూర్ ప్రజలకు అధికారులు ఈవీఎంల పనితీరును వివరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రుక్మాపూర్ సర్పంచ్ శివలీల, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఐ రాజిరెడ్డి

విద్యతోనే ఉన్నత స్థాయికి..

చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్మన్ వెంకటేశ్

అనంతగిరి: బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతీ కృషి చేయాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్మన్ వెంకటేశ్ అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలోని స్త్రీశక్తి భవనంలో సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో «విద్యా హక్కు చట్టం అమలు–ప్రజల భాగస్వామ్యం»పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్ మాట్లాడుతూ.. విద్యతో ఏదైనా సాధించవచ్చుననే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. పిల్లలు ఉన్నత విద్యావంతులుగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించాలని సూచించారు. నేటికీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తరగతి గదికి తగిన సామర్థ్యాలు విద్యార్థుల వద్ద లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా బాలల రక్షణ విభాగం చైల్డ్ లైన్ 1098, 100, సఖి లాంటి సంస్థలు ఉన్నతంగా పనిచేస్తున్నాయన్నారు. ఎక్కడ ఇబ్బందులున్నా వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం సాధన సంస్థ కోఆర్డినేటర్ మురళి మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం వచ్చి పదేళ్లు దాటినా నేటికీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బాలల సంక్షేమ కమిటీ సభ్యులు ప్రకాష్, సంగమేశ్వర్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, సఖి ప్రతినిధులు ప్రకాశ్, నర్సింలు, ఎంవీ ఫౌండేషన్ ఇన్‌చార్జి వెంకటయ్య, బాలల హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు రంగారెడ్డి, వెంకట్రావు, నాగరాజు, చైల్డ్ లైన్ కౌన్సిలర్ రామేశ్వర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు, వివిధ సంస్థల ప్రతినిధులు, సాధన మండల ఇన్‌చార్జి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యాహక్కు చట్టం వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఫొటోగ్రఫీ అందమైన కళ

స్త్రీ, శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ రంగారెడ్డి జిల్లా చైర్‌పర్సన్ విశాల

కేశంపేట: ఫొటోలు, వీడియోలు అందంగా తీయడం అందమైన కళ అని స్త్రీ, శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాలరెడ్డి అన్నారు. ఫొటోగ్రాఫర్స్ మరియు వీడియోగ్రాఫర్ల జిల్లా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శంషాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ కార్యకర్మంలో పాల్గొన్న ఆమె మాటత్లాడుతూ.. మనల్ని మనకు, ప్రపంచానికి పరిచయం చేసేది ఫొటో, వీడియోగ్రఫీ అన్నారు. యువత స్వయం శక్తితో రాణించేందుకు ఫొటోగ్రఫీ సహకరిస్తుందని అన్నారు. ఎంచుకున్న వృత్తిలో ఉన్నతంగా రాణించాలని ఆమె ఆకాంక్షించారు.

గ్రామాల్లో గద్దర్ గుర్తులు

- ఆయన స్ఫూర్తితో కవులు, కళాకారులు, ఉద్యమకారులు తయారు
- జ్ఞాపకాలను నెమరేసుకున్న ప్రజలు



వడిచర్ల సత్యం రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గద్దర్ (ఫైల్)



రేగడిమైలారంలో నివాళులర్పిస్తున్న యువకులు

బొంరాస్‌పేట: ''ప్రశ్నించిన కలమతడు, గర్జించిన గళమతడు, సామాన్యుల ముమ్ముందుకునడిపించిన బలమతడు!'' కర్ణాటక రాష్ట్ర పొలిమేరకు ఆనుకొని కొడంగల్ నియోజకవర్గంతో గుమ్మడి విఠల్‌రావు (గద్దర్)తో ఉద్యమ, సాహిత్య అనుబంధాలు అనేకమున్నాయి. గద్దర్ స్ఫూర్తితో కవులు, కళాకారులు, ఉద్యమకారులు తయారయ్యారు. ప్రధానంగా బొంరాస్‌పేట మండలంలోని కొత్తూరు, రేగడిమైలారం, వడిచర్ల, కోస్గి మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి, గుండుమాల్, మద్దూరు మండలంలోని దొరెపల్లి తదితర గ్రామాలతో, ఉద్యమకారులతో ఉన్న సంబంధాలు దుఃఖిస్తున్నాయి. మరణం పట్ల నివాళులర్పిస్తున్నారు. అమరుడైన ప్రజా యుద్ధనౌక గద్దర్‌తో ఉన్న జ్ఞాపకాలను ఈసందర్భంగా మంగళవారం 'సాక్షి'తో పంచుకున్నారు.

కవి వడిచర్ల సత్యంతో

2011లో తెలంగాణ రాష్ట్ర సాధనకు సుమారు 40 రోజుల పాటు సాగిన సకల జనుల సమ్మెలో భాగంగా నియోజకవర్గంలోని బొంరాస్పేట మండలం వడిచర్లకు చెందిన తెలుగుపండిత్, కవి సత్యంగారు గద్దర్‌ను కలిశారు. 'తెలంగాణ ఉయ్యాల'అనే పుస్తకాన్ని గద్దర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. తనను గద్దర్ అభినందించారని కవి సత్యం సాక్షితో పంచుకున్నారు.

ఆశ నిరాశయింది



ఆయన మరణం తీరని లోటు. నాకు భూపంపిణీ, సమసమాజం, సోషలిజం, భూమిలేని నిరుపేదలకు, దోపిడి నిర్మూలనం సమస్యలపై స్పందించే స్పృహ కలగడంలో గద్దర్ ముఖ్యులు. తాను 90శాతం వర్గ పోరుకే ప్రాధాన్యత ఇచ్చారు. అప్పట్లో నేను చేస్తున్న కేఎస్‌పీఎస్, సామాజిక ఉద్యమాలను అభినందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, గద్వాల, మహబూబ్‌నగర్, ప్రాంతాల ఉద్యమాల్లో గద్దర్‌తో పాల్గొని తృప్తి చెందాను. 'కొండను ఢీకొనే చోట రాయి విసరడమా?' అంటూ కొడంగల్ సమస్యల పట్ల పరిష్కార మార్గాలు చూపారు. నాలుగేళ్ల క్రితం నుంచి భూమిబదులు ఆత్మగౌరవం, అస్తిత్వ పోరాటాలవైపు వెళ్లడంతో ఉద్యమాలు విచ్ఛిన్నమయ్యాయని చెప్పారు. ఆయన ఆశయాల వైపు ప్రజలు వెళ్లలేరు. గద్దర్ పీడిత పట్ల మెరుపు, వెలుగయ్యారు. గద్దర్ ఉద్యేశాలతో ప్రజలు గౌరవంగానే ఉన్నారు. మాగ్రామంలో ఏర్పాటు చేసే అంబేద్కర్ విగ్రహావిష్కరణకు గద్దర్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించాలని ఆశ నిరాశయింది.

– కొత్తూరు చంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి

అప్పల బాధ తాళలేక వ్యక్తి బలవన్మరణం


శంకర్‌పల్లి: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శంకర్‌పల్లి పీఎస్ పరిధిలోని రామంతపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బక్కనోళ్ల పాండు(47) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అప్పులబాధ ఎక్కువవ్వడంతో మనస్తాపం చెందిన ఆయన పురుగుమందు సేవించాడు. దీంతో ఆయనకు విరేచనాలు పెట్టడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన పరిస్థితి విషమించడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

ఈత, తాటి వనాలకు స్థలం కేటాయించండి

గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్

శంకర్‌పల్లి: హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సర్పంచ్‌లు ఈత, తాటి చెట్లను నాటే విధంగా చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో, పార్కుల్లో ఈత, తాటి చెట్లను పెంచాలని సూచించారు. ప్రభుత్వం ఈత, తాటి వనాలను పెంచేందుకు స్థలం కేటాయించాలని కోరారు.

పదవుల్లో ఉన్నవారు ప్రజాసేవ చేయాలి



పత్యానాయక్ సేవా ట్రస్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలి
- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: రాజకీయాల ద్వారా పదవులు పొందిన వారు ప్రజాసేవలో ముందుండాలని కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సూచించారు. బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు సేనావత్ పత్యానాయక్ నూతనంగా ఏర్పాటు చేసిన పత్యానాయక్ సేవా ట్రస్టును మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలన్నారు. పత్యానాయక్ ట్రస్టు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు అనురాధ, దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు, ఆమనగల్లు, కడ్తాల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నారాయణ, వీరయ్య, పార్టీ నాయకులు కుమార్, లచ్చిరాంనాయక్, గణేశ్, సత్యం, శివ, మల్లేశ్‌నాయక్, సయ్యద్ ఖలీల్, రమేశ్, యాదగిరి, రమేశ్‌నాయక్, అల్లాజీ, చంద్రు, వెంకటేశ్, రంజిత్, సోన శ్రీనునాయక్ పాల్గొన్నారు.

యాదవులకు గొర్రెల పంపిణీ

మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి, నర్సంపల్లి గ్రామాలకు చెందిన 64 మంది యాదవులకు ఎమ్మెల్యే గొర్రెలను పంపిణీ చేశారు. బ్రాహ్మణపల్లి, కాశిగూడెం గ్రామాల్లో పంచాయతీ కార్యాలయం భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, సర్పంచ్‌లు జోజమ్మ, బాల్‌రెడ్డి, లక్ష్మయ్య, రమేశ్‌రెడ్డి, పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వెంకటయ్య, పార్టీ నాయకులు లాలయ్యగౌడ్, సత్తయ్య, ఆరోగ్యరెడ్డి, శ్రీను, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్‌పాసులు అందజేత



విద్యార్థులతో ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

అనంతగిరి: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో డాక్టర్ సబితానంద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా బస్సు పాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న 3వేల మంది పేద విద్యార్థులకు (ఒక లక్ష 80 వేల రూపాయలతో) సబితా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా బస్‌పాసులు పంపిణీ చేశారని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడేలా మీరు చదివిన పాఠశాలలకు మీరే ముఖ్యఅతిథిగా వచ్చే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ సబితా ఆనంద్, ఆర్టీసీ డీఎం బక్షి నాయక్, ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ సిబ్బంది, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.